నమస్తే తెలంగాణ
నల్లగొండ
5 నల్లగొండ, శనివారం 14 జూన్ 2025 NALGONDA

## • ఎమ్మెల్యే పల్లాకు సునీత పరామర్శ



ఇటీవల ప్రమాదవశాత్తు గాయపడి సోమాజిగూడ యశోద దవాఖానలో చికిత్స పొందుతున్న జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డిని ప్రభుత్వ మాజీ విప్ గొంగిడి సునీతామహేందర్‌రెడ్డి పరామర్శించారు. శుక్రవారం యశోద ఆసుపత్రికి చేరుకుని ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. త్వరగా కోలుకొని ప్రజాక్షేత్రంలోకి రావాలని ఆకాంక్షించారు.

- యాదగిరిగుట్ట



# మూసీకి 492 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో

## 640 అడుగులకు పెరిగిన నీటిమట్టం

కేతేపల్లి, జూన్ 13: మూసీ ప్రాజెక్టుకు ఎగువ ప్రాంతాల నుంచి శుక్రవారం 492.24 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో కొనసాగింది. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 645(4.46 టీఎంసీలు)కాగా, ప్రస్తుతం 640.85(3.41 టీఎంసీలు) అడుగులకు పెరిగింది. నెల రోజులుగా ప్రాజెక్టు ఎగువ ప్రాంతాలైన హైదరాబాద్, జనగామ, వరంగల్ తదితర ప్రాంతాల్లో కురుస్తున్న వర్షాలతో ఇన్‌ఫ్లో నిలకడగా 400 క్యూసెక్కులకు పైగా వస్తున్నది. ఏప్రిల్‌లో ప్రాజెక్టు కుడి, ఎడమ కాల్వలకు నీటి విడుదల నిలిపివేసినప్పటి నుంచి ఇప్పటి వరకు సుమారు17 అడుగుల మేరకు ప్రాజెక్టు నీటిమట్టం పెరిగింది. ఇన్‌ఫ్లో ఇదేస్థాయిలో కొనసాగితే ఈ నెల చివరి వరకు నీటిమట్టం 645 అడుగులకు పెరిగే అవకాశం ఉన్నది. ప్రాజెక్టులో నీటిమట్టం పెరుగుతుండటం, వానకాలం సీజన్ ప్రారంభం కావడంతో అధికారులు ప్రాజెక్ట్ కాల్వలకు నీటిని విడుదల చేయాలని రైతులు కోరుతున్నారు.

# ఫ్రీ కరెంట్ పరేషాన్!

## సెలూన్లు, లాండ్రీలకు సర్కారు బకాయి • కాంగ్రెస్ వచ్చాక ఒక్క పైసా చెల్లించని వైనం

- ఒక్కో షాపునకు రూ.50 వేల వరకు పెండింగ్
- క్లియర్ చేయాలని యజమానులు, అధికారుల ఒత్తిడి
- దిక్కుతోచని స్థితిలో రజకులు, నాయీబ్రాహ్మణులు
- బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో ఠంచనుగా చెల్లింపులు




**ఈ ఫొటోలో ఉన్న బిల్లు యజమాని పేరు కొడపర్తి కనకయ్య. గుండాలలో లాండ్రీషాపు నడిపిస్తూ జీవనం కొనసాగిస్తున్నాడు. నెలకు రూ.400- 500 వరకు బిల్లు వస్తున్నది. మే నెల కరెంట్ బిల్లు జనరేట్ చేయగా.. ఏరియర్స్‌తో కలిపి మొత్తం రూ.9,909 వచ్చింది. గతంలో ప్రభుత్వం నెలనెలా డబ్బులు చెల్లించడంతో జీరో బిల్లు మాత్రమే వచ్చేది. కానీ, కాంగ్రెస్ సర్కారు పట్టించుకోపోవడంతో బిల్లు భారీగా పెరిగిపోయింది. ఇది ఒక్కరి సమస్య మాత్రమే కాదు.. జిల్లాలో వేలాదిమంది రజకులదీ ఇదే పరిస్థితి.**

యాదాద్రి భువనగిరి, జూన్ 13(నమస్తే తెలంగాణ) : రజక, నాయీబ్రాహ్మణులకు కరెంట్ కష్టాలు తప్పడం లేదు. సెలూన్లు, ధోబీఘాట్, లాండ్రీ షాపులకు సర్కారు కరెంట్ బిల్లులు చెల్లించడంలేదు. బీఆర్‌ఎస్ హయాంలో నెలనెలా ఠంచనుగా చెల్లించగా.. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక ఒక్క పైసా కట్టలేదు. దీంతో రజక, నాయీబ్రాహ్మణులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. బిల్లుల చెల్లింపు కోసం ఆయా వృత్తిదారులు సర్కారుపై ఉద్యమానికి సన్నద్ధమవుతున్నారు.

### కేసీఆర్ హయాంలో ఠంచన్‌గా జమ..

బీఆర్‌ఎస్ ప్రభుత్వంలో అన్ని కులాలకు సమప్రాధాన్యం కల్పించింది. కులవృత్తులకు బాసటగా నిలిచింది. ఉమ్మడి పాలకుల నిర్లక్ష్యానికి గురైన నాయీబ్రాహ్మణులు, రజక వృత్తులకు జీవం పోసింది. సెలూన్లు, లాండ్రీ షాపులకు ఉచిత కరెంట్ పథకానికి శ్రీకారం చుట్టింది. నెలకు 250 యూనిట్ల వరకు ఫ్రీ కరెంటు అందించింది. దీనికి అయ్యే ఖర్చును 2021 నుంచి మొత్తం ప్రభుత్వమే భరించింది. నెలనెలా జీరో బిల్లులు మాత్రమే వచ్చేవి. దీంతో లబ్ధిదారులు సంతోషంగా తమ వృత్తులు చేసుకునేవారు. విద్యుత్ వినియోగం 250 యూనిట్లు దాటితే అదనపు వినియోగానికి అయ్యే బిల్లు లబ్ధిదారుడే భరించాల్సి ఉంటుంది. కానీ, ఇప్పుడు పరిస్థితి తారుమారైంది. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక ఒక్క పైసా బిల్లులు చెల్లించలేదు. జీరో బిల్లుకు బదులు నెలనెలా అమౌంట్‌తో బిల్లులు జారీ చేస్తున్నారు. ఒక్కొక్కరికి వేలల్లో బిల్లులు వస్తుండడంతో దిక్కుతోచని పరిస్థితిలో కొట్టుమిట్టాడుతున్నారు.

### సెలూన్లకు వేలల్లో బిల్లులు..



ఉమ్మడి జిల్లావ్యాప్తంగా సుమారు 3,500 సెలూన్లు ఉండగా.. యాదాద్రి భువనగిరి జిల్లాలో 800వరకు ఉన్నాయి. వీరంతా ఉచిత కరెంట్‌ను వినియోగిస్తున్నారు. తాజాగా ప్రభుత్వం బిల్లులు చెల్లించకపోవడంతో నాయీబ్రాహ్మణులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అధిక శాతం సెలూన్లు అద్దె షాపుల్లోనే కొనసాగుతున్నాయి. వేలల్లో బిల్లులు వస్తుండటంతో చెల్లించాలంటూ యజమానులు ఒత్తిడి పెంచుతున్నారు. షాపు ఖాళీ చేయమని స్పష్టంచేస్తున్నారు. ఇక బిల్లులు పెరిగిపోవడంతో చెల్లించాలంటూ పలుచోట్ల విద్యుత్ అధికారులు ఒత్తిడి తెస్తున్నారు. కరెంట్ కట్ చేస్తామనే సంకేతాలు ఇస్తున్నారు. మరోవైపు దుకాణాల అడ్రస్‌లు మార్చుకున్నప్పుడు కొత్త కనెక్షన్లు సైతం ఇవ్వడం లేదు.

### రజకులకూ తప్పని కష్టాలు



ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా సుమారు 12 వేల మంది రజకులు ఉండగా, యాదాద్రి జిల్లాలో 3,500 మంది ఉచిత కరెంట్ పొందుతున్నారు. లాండ్రీ నడిపితేనే జీవనం గడుస్తుంది. ఒక్కో షాపునకు నెలకు రూ.500 నుంచి రూ.1500 వరకు బిల్లులు వచ్చేవి. దీంతో నెలనెలా బిల్లులు చెల్లించడం భారంగా మారేది. బిల్లులు తడిసిమోపడయ్యేవి. దీంతో బీఆర్‌ఎస్ ప్రభుత్వం ఫ్రీ కరెంట్‌ను అమలుచేసి ఊరట కల్పించింది. విద్యుత్ మీటరు, స్విచ్ బోర్డు, వైరింగ్‌తో పాటు కనెక్షన్ ఉచితంగా ఇచ్చింది. ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వం బడ్జెట్‌లో నిధులు కేటాయించినా.. విడుదల చేయకపోవడంతో సమస్య జటిలమైందని ఆయా కులసంఘాల నేతలు చెబుతున్నారు. ఇక ఉచిత విద్యుత్ కమర్షియల్ కేటగిరీ ఎల్‌టీ-2లో ఉండటంతో యూడీఎస్, ఎల్‌డీసీ, అదనపు లోడ్ చార్జీల పేరుతో యూజర్ చార్జీలు వేస్తున్నారని పలువురు ఆరోపిస్తున్నారు.



డ్యాం క్రస్ట్‌గేట్ల రోప్‌లకు గ్రీసింగ్ చేస్తున్న ఎన్నెస్పీ సిబ్బంది

# సాగర్‌కు మరమ్మతులు

నందికొండ, జూన్ 13 : నాగార్జునసాగర్ డ్యామ్ క్రస్ట్‌గేట్లకు ప్రతి ఏటా చేపట్టాల్సిన మరమ్మతు పనులను డ్యాం సిబ్బంది ముమ్మరంగా కొనసాగిస్తున్నారు. డ్యాం క్రస్ట్ గేట్లకు ఆయిలింగ్, గ్రీజింగ్, సీళ్ల లాంటి పనులను పూర్తి చేశారు. డ్యాం 26 క్రస్ట్ గేట్లను ట్రయల్ రన్ నిర్వహిస్తూ గేట్ల రోప్‌లకు గ్రీసింగ్ పనులు చేపడుతున్నారు. మరో వారం రోజుల్లో డ్యాం క్రస్ట్‌గేట్ల మరమ్మతు పనులు పూర్తికానున్నట్లు సిబ్బంది తెలిపారు. కృష్ణా పరీవాహక ప్రాంతాల్లో వర్షాలు పడుతుండడం, శ్రీశైలం ఎగువన ఉన్న రిజర్వాయర్లలోకి వరద నీరు వచ్చి చేరుతుండడంతో దిగువన ఉన్న నాగార్జునసాగర్ డ్యామ్‌లోకి నీరు వచ్చి చేరే అవకాశం ఉన్నది. దీంతో నాగార్జునసాగర్ డ్యాం వార్షిక మరమ్మతుల పనులను త్వరితగతిన పూర్తిచేస్తున్నారు. ఈ సందర్భంగా డ్యాం ఇన్‌చార్జి ఎస్‌ఈ మల్లికార్జునరావు మాట్లాడుతూ.. డ్యాం 26 క్రస్ట్ గేట్ల మరమ్మతులను వారం రోజుల్లో పూర్తి చేస్తామని తెలిపారు. డ్యాం గ్యాలరీలో క్లీనింగ్, లైటింగ్ పనులను చేస్తున్నట్టు తెలిపారు. డ్యాం స్పిల్‌వే పనులకు సంబంధించి ప్రతిపాదనలు పంపామని, స్పిల్‌వే పనులను చేసేందుకు జూలై చివరి వారం వరకూ అవకాశం ఉన్నదని వెల్లడించారు.

# నేడు లోక్ అదాలత్

## సద్వినియోగం చేసుకోవాలని ఎస్పీ నరసింహ పిలుపు




సూర్యాపేటటౌన్, జూన్ 13 : జాతీయ లోక్ అదాలత్‌ను కక్షిదారులు సద్వినియోగం చేసుకోవాలని సూర్యాపేట జిల్లా ఎస్పీ నరసింహ శుక్రవారం ఒక ప్రకటనలో కోరారు. శనివారం నిర్వహించే జాతీయ మెగా లోక్ అదాలత్‌లో పలు కేసులు పరిష్కారమవుతాయన్నారు. రాజీయే రాజమార్గమని, చిన్న చిన్న కేసులతో కక్షలు పెంచుకొని కోర్టుల చుట్టూ తిరిగి సమయం వృథా చేసుకోవద్దని తెలిపారు. న్యాయశాఖ ఇచ్చిన అవకాశాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. లోక్ అదాలత్ ద్వారా బాధితులకు సత్వరమే న్యాయం జరుగుతుందని తెలిపారు.



కలెక్టర్ తేజస్‌కు వినతిపత్రం అందజేస్తున్న ఉద్యమకారులు

# తెలంగాణ ఉద్యమకారుల సమస్యలు పరిష్కరించాలి

సూర్యాపేటటౌన్, జూన్ 13 : తెలంగాణ ప్రత్యేక రాష్ట్ర సాధనలో భాగస్వాములై పోరాడిన ఉద్యమకారుల సమస్యలను పరిష్కరించాలని తెలంగాణ ఉద్యమకారుల ప్రతినిధి బృందం ఆధ్వర్యంలో శుక్రవారం కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్‌కు వినతిపత్రం అందజేశారు. ఉద్యమకారులు మాట్లాడుతూ.. ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ ఉద్యమకారుల సంక్షేమానికి తోడ్పడుతామని హామీ ఇచ్చి అధికారంలోకి వచ్చాక విస్మరించిందన్నారు. ఉద్యమకారులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయడంతోపాటు గుర్తింపు కార్డులు ఇవ్వాలని, 250 గజాల ఇంటి స్థలం కేటాయించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కుంట్ల ధర్మార్జున్, తండు నాగరాజు, సామ అంజిరెడ్డి, మోర శైలేందర్, రహ్మాన్‌అలీ, రఘునందన్‌రెడ్డి, కొత్తగట్టు యాకయ్య, డేవిడ్‌కుమార్, బోడ శ్రీరాములు, వాసు, ఆవుల మధు, పంతం యాకయ్య తదితరులు పాల్గొన్నారు.







# అద్దె భవనంలో విద్యార్థుల అవస్థలు

నల్లగొండ పట్టణం రామగిరిలోని ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల విద్యార్థులు, ఉపాధ్యాయుల అవస్థలు వర్ణనాతీతంగా ఉన్నాయి. 1952లో ప్రారంభమైన ఈ పాఠశాల.. నాటి నుంచి నేటి వరకు అద్దె భవనంలోనే కొనసాగుతున్నది. కాలక్రమేణా ఈ పాఠశాల భవనం శిథిలావస్థకు చేరుకున్నది. తలుపులు, కిటికీలు ధ్వంసమయ్యాయి. పైకప్పు రేకులకు రంధ్రాలు పడ్డాయి. చినుకు పడితే తరగతి గదులు చిత్తడిగా మారుతున్నాయి. 2021 నుంచి భవనానికి అద్దె చెల్లించడం లేదు. దీంతో భవన యజమాని మరమ్మతులు చేయడం లేదు. భవనాన్ని ఖాళీ చేసి వెళ్లాలని కోరుతున్నాడు. చేసేదేమీ లేక సమస్యల నడుమ పాఠశాల కొనసాగుతున్నది. తాగేందుకు నీళ్లు కూడా హెచ్‌ఎం తన సొంత డబ్బులతో తెప్పిస్తున్నాడు. పాఠశాలలో ప్రస్తుతం 89 మంది విద్యార్థులు ఉన్నారు.

- స్టాఫ్ ఫొటోగ్రాఫర్, నల్లగొండ






వర్షానికి కురుస్తున్న ఇంటిని చూపిస్తున్న పోశయ్య దంపతులు

### ఇందిరమ్మ ఇల్లు రాలేదని

# ఆత్మహత్యాయత్నం

## దరఖాస్తును తిరస్కరించిన అధికారులు

ఆలేరురూరల్, జూన్ 13 : ఇందిరమ్మ ఇల్లు రాలేదని పారిశుధ్య కార్మికుడు ఆత్మహత్యాయత్నం చేశాడు. ఈ ఘటన శుక్రవారం ఆలేరు మండలంలోని కొలనుపాకలో చోటుచేసుకున్నది. వెలితే గ్రామానికి చెందిన గంధమల్ల పోశయ్య 30 ఏండ్లుగా గ్రామపంచాయతీ పారిశుధ్య కార్మికుడిగా పనిచేస్తున్నాడు. గ్రామంలో ఆయనకు చిన్న రేకుల ఇల్లు ఉన్నది. వర్షం వస్తే కురుస్తున్నది. కాంగ్రెస్ ప్రభుత్వం ఇందిరమ్మ ఇల్లు ఇస్తుందనే నమ్మకంతో ప్రజాపాలనలో దరఖాస్తు చేసుకున్నాడు. ఇటీవలే ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య ఇందిరమ్మ ఇండ్ల మంజూరు పత్రాలను లబ్ధిదారులకు అందజేశాడు. అందులో తన పేరు రాలేదని అధికారులను అడగగా, ఇల్లు ఉండగా.. నీకెందుకు ఇస్తరు అని సమాధానం ఇచ్చారు. శుక్రవారం గ్రామంలో ఇందిరమ్మ ఇండ్లు మంజూరైన వారు ముగ్గులు పోస్తుండగా గమనించిన పోశయ్య మనస్తాపానికి గురై విషపూరిత ఆకు రసం తాగి ఆత్మహత్యకు యత్నించాడు. గమనించిన స్థానికులు ఆలేరులోని ప్రభుత్వ దవాఖానకు తరలించారు.

### చెక్ బౌన్స్ కేసులో పరారైన

# కాంగ్రెస్ నాయకుడు

భువనగిరి అర్బన్, జూన్ 13: చెక్ బౌన్స్ కేసులో పరారైన నిందితుడి కోసం పట్టణ పోలీసులు శుక్రవారం గాలింపు చర్యలు చేపట్టారు. పట్టణానికి చెందిన కాంగ్రెస్ మైనారిటీ నాయకుడు మహ్మద్ అతహర్‌పై భువనగిరి అదనపు జ్యుడీషియల్ ఫస్ట్‌క్లాస్ మెజిస్ట్రేట్ కోర్టులో చెక్ బౌన్స్ కేసు విచారణలో ఉన్నది. ఈ కేసులో నిందితుడిగా ఉన్న అతహర్ కోర్టు వాయిదాలకు హాజరు కావడం లేదు. న్యాయస్థానం అతడికి నాన్‌బెయిలబుల్ వారెంట్ జారీ చేసింది. నిందితుడి తరఫు న్యాయవాది కోర్టులో గురువారం రీకాల్ పిటిషన్ దాఖలు చేశాడు. కోర్టు పిటిషన్‌ను కొట్టి వేస్తూ నిందితున్ని కస్టడీకి తీసుకోవాలని పోలీసులను ఆదేశించింది. ఈ సమయంలో కోర్టు ఆవరణలో ఉన్న అతహర్ అక్కడి నుంచి పారిపోయాడు. నిందితున్ని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించాలని న్యాయమూర్తి పట్టణ పోలీసులను ఆదేశించారు.